క్లుప్తంగా

భగీరథ నీటి కోసం నిరసన



నిరసన తెలుపుతున్న కాలనీవాసులు

సిరికొండ: మండల కేంద్రంలో మిషన్ భగీరథ నీటి కోసం ఎస్టీ కాలనీవాసులు ఖాళీ బిందెలతో రోడ్డెక్కి నిరసన తెలిపారు. భగీరథ నీరు లేక చాలా ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. స్పందించిన సర్పంచ్ నర్మద కాలనీవాసులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఉపకార వేతనాలు వినియోగించుకోవాలి

ఇచ్చోడ: గురుకుల విద్యార్థుల కోసం పదిహేను రోజుల పాటు ఇచ్చోడలో నిర్వహిస్తున్న స్పార్క్‌లెస్ విద్యార్థులు చక్కగా సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి సూచించారు. గురువారం నిర్మల్ జిల్లా కేంద్రంలో స్పార్క్‌లెస్ పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులకు వివిధ రంగాల్లో మరింత నైపుణ్యత పెంపొందించడానికి స్పార్క్‌లెస్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 22 నుంచి మే 6వరకు గిరిజన, సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న 200 మంది విద్యార్థులు శిక్షణ శిబిరంలో పాల్గొననున్నట్లు తెలిపారు. గిరిజన గురుకులాల ఆర్సీవో గంగాధర్, నిర్మల్ డీఈవో రవీందర్ రెడ్డి, ఇచ్చోడ గిరిజన గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

సరుకులు పంపిణీ

ఉట్నూర్‌రూరల్: రంజాన్ పండుగ పురస్కరించుకొని మండల కేంద్రంలోని జమాతే ఉల్మాయే హింద్, అర్షద్ మదని గ్రూప్స్ ఆధ్వర్యంలో ముస్లింలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉట్నూర్ మండల కమిటీ అధ్యక్షుడు సలీం ఖాన్, టౌన్ అధ్యక్షుడు అంజత్ ఖాన్, నయీమ్‌లు పాల్గొన్నారు.

అమరవీరులకు నివాళి

బోథ్: ఇంద్రవెల్లిలో 42 ఏళ్ల క్రితం అమరులైన ఆదివాసీ బిడ్డలకు మండలంలోని సోనాల గ్రామంలో కుమురం భీం విగ్రహం వద్ద ఆదివాసీలు నివాళులర్పించారు. అనంతరం సంప్రదాయ పూజలు నిర్వహించారు. ఇంద్రవెల్లి ఘటనను ఆదివాసీలు ఎప్పటికీ మర్చిపోరని అన్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ డైరెక్టర్ మెస్రం భూమన్న, సార్‌మెడి తొడసం లక్ష్మణ్, మెస్రం లాలురామ్, భగవంతు, శంభు, సీతారాం, మారుతి, గోవింద్ పటేల్ పాల్గొన్నారు.

పేపర్ల దగ్ధం

ఉట్నూర్‌రూరల్: మండలంలోని శ్యాంపూర్ ప్రాథమిక పాఠశాలలో టీచర్ లెర్నింగ్ మెటీరియల్, ఇతర రికార్డులకు సంబంధించిన పేపర్లు దగ్ధమయ్యాయి. పాఠశాల ఉపాధ్యాయుల ఫిర్యాదు మేరకు ఎస్సై భరత్‌సుమన్ పాఠశాలను పరిశీలించారు. ఉపాధ్యాయులు ద్వారా వివరాలు సేకరించారు. పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయడం జరుగుతుందని ఎస్సై తెలిపారు. ఆయన వెంట వైస్ ఎంపీపీ బాలాజీ, కాటం రమేశ్, రవీందర్, గ్రామస్తులు తెలిపారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

ఆదిలాబాద్‌అర్బన్: భవన నిర్మాణ కార్మికులు పొందిన శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కార్మికశాఖ సహాయ అధికారులు రాజలింగు, వినోద్ అన్నారు. న్యాక్ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులకు, ప్లంబర్లకు 15 రోజుల పాటు ఉచిత శిక్షణ ఇవ్వడం జరిగింది. శిక్షణ గురువారంతో ముగిసింది. శిక్షణ కాలంలో ఒక్కొక్కరికి రోజుకు రూ.300 చొప్పున పదిహేను రోజులకు రూ.4500 ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో న్యాక్ శిక్షకుడు ద్యావంత్ రమేశ్, దీపక్, కార్మికులు పాల్గొన్నారు.

'కంటివెలుగు' సద్వినియోగం చేసుకోవాలి

ఉట్నూర్‌రూరల్: తెలంగాణ ప్రభుత్వం పేదల కోసం అమలు చేస్తున్న కంటివెలుగును సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ జైవంత్ రావు అన్నారు. గురువారం మండలంలోని గంగాపూర్‌లో కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

రాజశేఖర్ సేవలు చిరస్మరణీయం

ఆదిలాబాద్: సీనియర్ హాకీ క్రీడాకారుడు గుడ్ల రాజశేఖర్ జిల్లాలో హాకీ క్రీడకు చేసిన సేవలు చిరస్మరణీయమని ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్ రెడ్డి అన్నారు. రాజశేఖర్ ఇటీవల మృతి చెందగా జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రదర్శిని స్టేడియంలో గురువారం సంతాప సభను ఏర్పాటు చేశారు. హాకీ కోచ్‌లు, సీనియర్, జూనియర్ క్రీడాకారులు ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐటీడీఏ డీఈ సంతోశ్‌కుమార్, మల్లేశ్వరరావు, దేవిదాస్, లింగయ్య, విలాస్, విశ్వాస్, సాగర్, రాజు, లెనిన్, పంకజ్, శ్రీను, అశోక్, సుధీర్, గోవింద్, అరుణ్ పాల్గొన్నారు.

తాటి ముంజలు వచ్చేశాయి

- ఎండ నుంచి ఉపశమనం
- తినేందుకు ప్రజల ఆసక్తి
- ఉపాధి పొందుతున్న చిరువ్యాపారులు



తాటి ముంజలు



తాటి ముంజలు విక్రయిస్తున్న వ్యాపారులు

ఉట్నూర్: మార్కెట్‌లోకి తాటి ముంజలు వచ్చేశాయి. వేసవిలో ఎండ తీవ్రత నుంచి తాటి ముంజలు మంచి ఉపశమనం కలిగిస్తున్నాయి. వేసవిలో ప్రత్యేకంగా లభించే తాటిముంజలు తినేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. వాటిలోని పోషకాల వల్ల శరీరం వడదెబ్బకు గురికాకుండా ఉంటుంది. అందుకే వీటిని 'గర్మీకే దుష్మన్'లు అంటారు. ప్రస్తుతం తాటి ముంజల వ్యాపారం జోరందుకుంది. శీతల పానీయాలు, జ్యూస్ సెంటర్‌లో లభించే జ్యూస్‌ల కంటే ప్రకృతి సిద్ధంగా లభించే తాటి ముంజలు ఎక్కువగా అమ్ముడవుతున్నాయి.

నెల రోజుల పాటు..

వేసంఇలో నెలరోజుల పాటు తాటి ముంజలు లభిస్తాయి. ఇందులో గువ్వం నీరు ఎంతో శ్రేష్ఠమైంది. లేత ముంజల నుంచి కొబ్బరి నీళ్ల లాంటి ద్రవ పదార్థం శరీరానికి ఎంతో శక్తినిస్తుంది. ముదిరిన ముంజల నుంచి లభించే గువ్వం ఆరోగ్యానికి మేలు చేస్తుందని వైద్యులు సూచిస్తున్నారు. సాధారణంగా గీత కార్మికులు ఈ ముంజలను కోసిస్తుంటారు. చిరు వ్యాపారులు ముంజల విక్రయాలపై దృష్టి సారించడంతో గీతా కార్మికుల పంట పండుతోంది. వారసంతల్లో, గ్రామాల్లో విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో డజను తాటి ముంజులు రూ. 60 నుంచి రూ. 80 ధర ఉంది. మండల కేంద్రాల్లో హాట్ కేకుల్లా అమ్ముడవుతున్నాయి. రెండు రోజుల ముందే కోసి పట్టణ ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాపురావు

ఆదిలాబాద్‌అర్బన్: బీఆర్ఎస్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. గురువారం పట్టణంలోని టైలర్స్ కాలనీలోని ఆయన నివాసంలో మండల కన్వీనర్లు, పార్టీ బాధ్యులతో నియోజకవర్గస్థాయి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అధిష్ఠానం పిలుపు మేరకు ఈనెల 25న పల్లెనుంచి పట్నం వరకు ప్రతీ ఇంటిపై గులాబీ జెండాను ఎగరవేసేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఇప్పటికే ఆత్మీయ సమ్మేళనాల ద్వారా ప్రభుత్వ పనితీరును ప్రజలకు వివరిస్తామన్నారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే

గుడిహత్నూర్: స్థానిక మహమ్మదీయ మసీదులో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు పాల్గొన్నారు. మత సామరస్యాలను కాపాడుకునేందుకు యువత కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ మండల కన్వీనర్ కరాడ్ బ్రహ్మానంద్, కోఆప్షన్ సభ్యుడు జమీర్, జాదవ్ రమేశ్, మాజీ ఎంపీపీ సత్యరాజ్ పాల్గొన్నారు.

'ప్రజలను మోసం చేస్తున్న బీఆర్ఎస్'



మాట్లాడుతున్న చిట్యాల సుహాసినిరెడ్డి

బేల: బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని బీజేపీ జిల్లా నాయకురాలు చిట్యాల సుహాసినిరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పోనాల, రంఖం గ్రామాల్లో పర్యటించి ప్రజా సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ వచ్చిన తర్వాత కొత్త రేషన్‌కార్డులు ఇవ్వకపోవడంతో పాటు మార్పుచేర్పులకు అవకాశం లేకుండా చేసిందన్నారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారని, నిరుద్యోగ భృతి ఏమైందని ప్రశ్నించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కొత్తపల్లి సంతోశ్, గటిక క్రాంతికుమార్, ప్రమోద్‌రెడ్డి, సతీశ్ రెడ్డి, శ్రీపాద ప్రశాంత్, శివకిరణ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీల ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలి



విజయకేతనం చూపిస్తున్న పద్మశాలి కులస్తులు

ఆదిలాబాద్‌రూరల్: ఆర్థికంగా వెనుకబడి ఉన్న పద్మశాలీల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలని పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మచ్చ ప్రభాకర్ కోరారు. ఇటీవల నూతనంగా రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైనా ఆయన గురువారం జిల్లాకు రావడంతో ఆదిలాబాద్ పట్టణంలోని సంఘ భవనంలో ఘనంగా సన్మానించారు. ఆదిలాబాద్‌లో టెక్స్‌టైల్ పార్క్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే ప్రభుత్వం బీసీ సంక్షేమ శాఖ ద్వారా సబ్సిడీ రుణాలను అందించాలన్నారు. కార్యక్రమంలో జాతీయ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాసరి రమేశ్, కార్యదర్శులు మోర ఆశన్న, కామన్ విఠల్, సహాయ కార్యదర్శులు గాజుల హన్మండ్లు, దాసరి ఆశన్న, ఈరన్న, దంతేల వినోద్, అలిశెట్టి భాస్కర్ పాల్గొన్నారు.

నెలాఖరులోగా పనులు పూర్తి చేయాలి



వివరాలు తెలుసుకుంటున్న సెక్టోరియల్ అధికారి

నేరడిగొండ: మన ఊరు.. మన బడి పనులు ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని జిల్లా సెక్టోరియల్ అధికారి నారాయణ అన్నారు. గురువారం మండలంలోని బుగ్గారం(బి), వడూర్ గ్రామాలతో పాటు నేరడిగొండ మండల కేంద్రంలోని పాఠశాలలను సందర్శించారు. అదనపు తరగతి గదుల నిర్మాణం లేని పాఠశాలల్లో పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. విద్యార్థులు పరీక్షలు రాస్తున్న విధానాన్ని పరిశీలించారు. ఆయన వెంట డిప్యూటీ ఇంజనీర్ సునీల్, సీఆర్పీ సురేందర్, ప్రధానోపాధ్యాయులు, గుత్తేదారు కృష్ణ, జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

పరామర్శ

నేరడిగొండ: మండల కేంద్రానికి చెందిన లచ్చురామ్ నాయక్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబసభ్యులను ఏబీసీసీ సభ్యులు నరేశ్ జాదవ్ పరామర్శించారు. గురువారం వారి నివాసానికి చేరుకొని మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కుమ్రం కోటేష్, జాదవ్ వసంత్ రావు, శంశోద్దీన్, మల్యాల కరుణాకర్, సంజీవ్ రామ్ గౌడ్ పాల్గొన్నారు.

నార్నూర్: మండల కేంద్రంలోని మైనార్టీ వార్డుకు చెందిన బీఆర్ఎస్ యువ నాయకుడు సలీంను గురువారం కుమురంభీం జిల్లా సిర్పూర్ (యూ) మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు ఆత్రం అనిల్ పరామర్శించారు. ఇటీవల అతడు గుండెపోటుకు గురికావడంతో హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చాడు.

బోథ్: మండలంలోని ధన్నూర్(బి) గ్రామానికి చెందిన కారం లస్మయ్య ఇటీవల మృతి చెందారు. కాగా బాధిత కుటుంబాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ అధ్యాపకులు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ గురువారం పరామర్శించారు. ఆయన వెంట కుడాల స్వామి, అశోక్, ఆషన్న, అడెల్లు, ధర్మన్న, గోవర్ధన్, శ్యామ్ ఉన్నారు.

రేషన్ సరుకులు పంపిణీ

ఆదిలాబాద్‌అర్బన్: రంజాన్ మాసం పురస్కరించుకొని బెస్ట్ ఫ్రెండ్స్ హెల్ప్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో వితంతు మహిళలకు గురువారం జిల్లా కేంద్రంలో స్థానిక ఉర్దూఘర్‌లో రేషన్ సరుకులు పంపిణీ చేశారు. సొసైటీ అడ్వైజర్ సాబీర్ హుస్సేన్, సొసైటీ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, ఉపాధ్యక్షుడు పాలకొండ శ్రీకాంత్, మొహమ్మద్ ఇఫ్తార్ ఉద్దీన్, మొహమ్మద్ బాబర్, మర్రి విజయ్ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

నేరడిగొండ: మండల కేంద్రంలో సామాజిక కార్యకర్త, స్థానిక వార్డుసభ్యుడు సాబ్లే సంతోష్ సింగ్ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం ఏఎస్సై మారుతి ప్రారంభించారు. కార్యక్రమంలో వ్యాపారులు నాందేవ్, సాయి కిరణ్, సంతోశ్‌గౌడ్, బాక్రె శంకర్, ధన్నూ, ధరం సింగ్, శ్రీను, భావ్ సింగ్, మల్హరి, తదితరులు పాల్గొన్నారు.

నేడు న్యాయ విజ్ఞాన సదస్సు

కైలాస్‌నగర్: జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 21న దివ్యాంగులకు న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు సంస్థ జిల్లా కార్యదర్శి క్షమా దేశ్‌పాండే ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4గంటలకు కోర్టు ఆవరణలోని న్యాయ సేవా సదన్‌లో జరిగే కార్యక్రమానికి దివ్యాంగులు అధికసంఖ్యలో తరలిరావాలని ఆమె కోరారు.

1 నుంచి వైద్య శిబిరం

కైలాస్‌నగర్: ప్రపంచ కార్మిక దినోత్సవం (మే డే)ను పురస్కరించుకుని మే 1 నుంచి 3 వరకు భవన నిర్మాణ రంగ కార్మికులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు జిల్లా కార్మికశాఖ అధికారి రాజలింగు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని సెంట్రల్ గార్డెన్ (టీఎన్జీవోస్ భవన్)లో నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్మికశాఖ ద్వారా జారీ చేసిన లేబర్ గుర్తింపు కార్డు కలిగిన ప్రతీ కార్మికుడు అర్హుడన్నారు.

'రైతులకు నష్టం చేశారు'

బోథ్: గత నెలలో కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంట సర్వే చేసిన అధికారులు చాలా మంది రైతుల పంటలను లెక్కలోకి తీసుకోలేదని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న అన్నారు. 33 శాతం కంటే ఎక్కువ దెబ్బతిన్న పంటలను మాత్రమే వ్యవసాయాధికారులు నమోదు చేయడం సరికాదన్నారు.

ఆదివాసీ చట్టాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న శంకర్

బోథ్: మండలంలోని మామిడిగూడ గ్రామంలో న్యాయవాది పంద్రం శంకర్ ఆదివాసీ చట్టాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ చట్టాలను తెలుసుకోవాలన్నారు. పెసా చట్టంపై పలు విషయాలను వివరించారు. కార్యక్రమంలో గ్రామ పటేల్ మెస్రం కాశీరాం, దేవరి ఆత్రం నాగోరావ్, తుడుందెబ్బ మండల కార్యదర్శి దుర్వ విశ్వేశ్వర్, జుగ్నక్ భూమన్న, లాలురామ్, ఇస్తారి, శంకర్ పాల్గొన్నారు.


కప్పర్లలో ఇఫ్తార్

తాంసి: మండలంలోని కప్పర్ల గ్రామంలో గురువారం సర్పంచ్ సదానంద్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. స్థానిక మసీదులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ముస్లిం సోదరులు ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాజు, ఇమ్రాన్, అన్వర్, దస్తగిరి పాల్గొన్నారు.

రంజాన్ కానుకల పంపిణీ

కైలాస్‌నగర్: రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని నిరుపేద ముస్లింకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న కానుకలను గురువారం ఆదిలాబాద్ పట్టణంలోని బొక్కలగూడ కాలనీలో మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజానీ పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో కోఆప్షన్ మెంబర్ ఎజాజ్, నాయకులు శ్రీనివాస్, మోబిన్, మోసిన్, అతీక్, అబ్రార్ పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన ఉండాలి



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి

ఇచ్చోడ: సీపీఆర్‌పై ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలని జిల్లా ట్రెనింగ్ అధికారి డాక్టర్ మనోహర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. గుండెపోటుకు గురైతే దాదాపుగా 30 సార్లు ఛాతిపై ఒత్తాలన్నారు. ఇలా చేస్తే ప్రాణప్రాయం నుంచి బయటపడొచ్చన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు సాగర్. కిరణ్, హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. నిరుపయోగంగా గోదాం



జైనథ్: సాత్నాల ఆయకట్టు పరిధిలోని రైతుల కోసం నిర్మించిన గోదాం నిరుపయోగంగా మారింది. రైతుల పంట ఉత్పత్తులను నిల్వ ఉంచుకొని, మార్కెట్లో మంచి ధర వచ్చినప్పుడు అమ్ముకునేందుకు నిర్మించిన గోదాంను రైతులకు కేటాయించకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంది. ఇప్పటికైనా అధికారులు గోదాంను అందుబాటులోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

- సంబంధిత అధికారి: మారుతి, ఏఈఈ సాత్నాల, ఫోన్: 91549 51533

ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన బీజేపీ

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగు రామన్న

ఆదిలాబాద్‌రూరల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న ఆరోపించారు. గురువారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని చాందా (టి) గ్రామంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు. స్వరాష్ట్రంలో అభివృద్ధే లక్ష్యంగా సీఎం కేసీఆర్ ముందుకు సాగుతున్నారని అన్నారు. గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, ఎంపీపీ గంద్రత్ రమేశ్, రొకండ్ల రమేశ్, సర్పంచ్ దారట్ల భాస్కర్, ఆత్మ చైర్మన్ జిట్ట రమేశ్, మెట్టు ప్రహ్లాద్, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వీవోఏల సమ్మె



తాంసి: సమ్మెలో పాల్గొన్న వీవోఏలు



బోథ్‌లో..

తాంసి: సమస్యలు పరిష్కరించాలని వీవోఏలు చేపడుతున్న నిరవధిక సమ్మె గురువారం నాల్గో రోజుకు చేరుకుంది. భీంపూర్ మండల కేంద్రంలో సమ్మెలో భాగంగా నిరసన వ్యక్తం చేశారు. మండల అధ్యక్షుడు అరుణ్ మాట్లాడుతూ.. మహిళ సంఘాల అభివృద్ధికి కృషి చేస్తున్న వీవోఏలకు నెలకు రూ.26 వేల వేతనం ఇవ్వాలన్నారు. అర్హులైన వీవోఏలు సీసీలుగా ప్రమోషన్ కల్పిస్తూ ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సమ్మెలో వీవోఏలు రాంజీ, కవిత, రత్నమాల, ప్రమోద్ పాల్గొన్నారు.

తాంసిలో..

తాంసి మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మెకు దిగారు. ప్రభుత్వం వెంటనే వీవోఏలకు తగిన వేతనం ఇవ్వాలన్నారు. అలాగే ఉద్యోగ భద్రత కలించాలని డిమాండ్ చేశారు. రూ.10లక్షల ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రమేశ్, వీవోఏలు సుదర్శన్, పుష్ప, చందర్ పాల్గొన్నారు.

బోథ్: తమను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి, వేతనాలను రూ. 26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వీవోఏలు సమ్మె చేస్తున్నారు. గురువారం ఐకేపీ ఏపీఎంకు మాధవ్‌కు సమ్మెల నోటీస్ అందజేశారు. కార్యాలయం ఎదట భైఠాయించి, నినాదాలు చేశారు. భీమా కల్పించడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

'కేంద్రం నిధులు దారి మళ్లిస్తున్న ప్రభుత్వం'

ఆదిలాబాద్: గ్రామ పంచాయతీల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తే రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లిస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో అంబేద్కర్ జయంతి ఉత్సవాల్లో భాగంగా పారిశుధ్య కార్మికులను గురువారం సన్మానించారు. నిధులను సర్పంచ్‌లు వినియోగించకుండా అడ్డుకుంటుందన్నారు. కార్మికులకు గుర్తింపు, కనీస వేతనాలు ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. కార్యక్రమంలో లోక ప్రవీణ్ రెడ్డి, రఘుపతి, సుభాష్, చిలుకూరి జ్యోతి రెడ్డి, రత్నాకర్ రెడ్డి, సతీశ్, రాజు, రతన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో మహేందర్‌కుమార్

బేల: మండలంలోని సైద్‌పూర్, తోయగూడ గ్రామాల శివారులో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను గురువారం ఎంపీడీవో నేరల్‌వార్ మహేందర్‌కుమార్ పరిశీలించారు. కూలీల హాజరు సంఖ్య, మాస్టర్ రోల్స్ నమోదుపై ఆరా తీశారు. ఆయన వెంట ఎంపీవో శ్యాముల్, టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు ఉన్నారు.

సకాలంలో కూలి చెల్లించాలి

ఇంద్రవెల్లి: ఉపాధిహామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు సకాలంలో కూలి డబ్బులు చెల్లించాలని మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ కోరారు. గురువారం మండలంలోని ఏమాయికుంటలో ఉపాధి పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పని ప్రదేశంలో సౌకర్యాలను పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ పథకం ద్వారా కూలీలకు వంద రోజుల పని కల్పించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జాదవ్ లక్కన్, ఎంపీటీసీ పడ్వాల్ విజయ్‌సింగ్ పాల్గొన్నారు.

జడ్జికి సన్మానం

బోథ్: వనపర్తి జిల్లాకు బదిలీ అయిన ఆదిలాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీతను బోథ్ బార్ అసోసియేషన్ సభ్యులు గురువారం ఆదిలాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి, జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసోయేషన్ సభ్యులు వామన్‌రావ్ దేశ్‌పాండే, సెక్రటరీ పంద్రం శంకర్, న్యాయవాదులు ఆడెపు హరీష్, ధమ్మపాల్, కుమ్మరి విజయ్, జమీర్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

బోథ్: మండల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ బాలికల పాఠశాలలో ఈనెల 22న ప్రారంభమయ్యే స్పార్కల్స్ వేసవి శిబిరాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆదిలాబాద్‌లో అడిషనల్ కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, గురుకులాల డీసీవో శ్రీనివాస్, ప్రిన్సిపాల్ స్వర్ణలతలు గురువారం ఆవిష్కరించారు. నాయకత్వ లక్షణాలు, డిజైన్ థింకింగ్, వ్యాపార నైపుణ్యాలు, రాజకీయాల్లో పరిజ్ఞానంపై సంజయ్ గ్రూప్ బృందం శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ స్వర్ణలత తెలిపారు.